క్లుప్తంగా

'అరెస్టయిన ఎంఐఎం నేతలకు అండగా ఉంటాం'



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో అరెస్ట్ అయిన ఎంఐఎం పార్టీ నాయకులకు అండగా ఉంటామని మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మాజీ మంత్రి వెంట నాయకులు తాహేర్‌బిన్ హందాన్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు కలీం, వయీద్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



మోర్తాడ్: తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులలో ప్రతిభ కనబరిచిన వారికి ధర్మోరాకు చెందిన పద్మ, రాములు అనే దంపతులు నగదు పురస్కారాలు శుక్రవారం అందించారు. ముంబైలో స్థిరపడిన వీరు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 6 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులలో ప్రతిభ చూపినవారికి నెలకు రూ.500ల చొప్పున, ఏడాదికి రూ.6వేల పురస్కారం అందించారు. దాతలను సర్పంచ్ గడ్డం చిన్నారెడ్డి, ఉప సర్పంచ్ నవీన్, ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, ఉపాధ్యాయులు పురుషోత్తం, పీఈటీ శ్యామ్ అభినందించారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన టీపీసీసీ అధికార ప్రతినిధి



కమ్మర్‌పల్లి: టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన కాంగ్రెస్ నేత బాస వేణుగోపాల్ యాదవ్ శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. తనపై నమ్మకంతో అధికార ప్రతినిధిగా నియమించినందుకు రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి, ధన్యవాదాలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం ఎంపీపీ అక్కపల్లి సుజాత, జెడ్పీటీసీ నరోజి గంగారాంతో కలిసి అందజేశారు. టి.రాములుకు రూ.60 వేలు, జి.లింగురాంకు రూ.30 వేలు, యు. స్రవంతికి రూ.60 వేలు, పి. సవితకు రూ.60 వేలు మంజూరయ్యాయి. వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, సొసైటీ చైర్మన్ బద్దం సంజీవరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పత్తి లక్ష్మణ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ పత్తి రాము పాల్గొన్నారు.

బాల్కొండలో..



బాల్కొండ: మండల పరిధిలో పలు గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి చేతుల మీదుగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీకాంత్, నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యులు లింగాగౌడ్, దాసరి వెంకటేశ్, తాటు గంగాధర్, సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ వాహబ్‌పాల్గొన్నారు.

రాంచంద్రపల్లికి రూ.54 లక్షలు మంజూరు



మాక్లూర్: రాంచంద్రపల్లిలో అభివృద్ధి పనులకు స్థానిక ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ. 54 లక్షలు మంజూరు చేసినట్టు బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు తొగరి భూషణ్ శుక్రవారం తెలిపారు. మంజూరైన నిధులతో గ్రామంలో చేపట్టాల్సిన పనులపై పంచాయితీరాజ్ ఏఈ శ్రీనివాస్ గ్రామస్తులతో సమావేశమయ్యారు. తక్షణ చర్యగా చేపట్టాల్సిన పనులను గుర్తించినట్లు తెలిపారు. సర్పంచ్ కట్కం గంగాధర్, ఎంపీటీసీ పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

ఉప కేంద్రానికి అపకారం

- ఆకతాయిలకు అడ్డాగా మారిన వైనం
- నికాల్‌పూర్ హెల్త్ సబ్ సెంటర్‌లో ధ్వంసమైన తలుపులు, కిటికీలు
- భయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల పరిధిలో ఉన్న నికాల్‌పూర్ ఆరోగ్య ఉప కేంద్రానికి రక్షణ కరువైంది. ఆకతాయిలు అడ్డాగా మార్చుకుని రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ప్రజలకు ఉపకారం చేసే ఉప కేంద్రం ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. దీంతో ఆరోగ్య సిబ్బంది ఇక్కడ డ్యూటీ చేయడానికి భయపడుతున్నారు. దీనికి తోడు సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నికాల్‌పూర్, కోమటపల్లి గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం 2012లో హెల్త్ సబ్ సెంటర్‌ను నికాల్‌పూర్‌లో ఏర్పాటు చేసింది. ఇందులో ఇద్దరు ఏఎన్‌ఎంలు పని చేయాల్సి ఉండగా, ఒక పోస్టు ఖాళీగా ఉంది. ముగ్గురు ఆశా వర్కర్లు పని చేస్తున్నారు. చిన్నపాటి గాయాలతో వచ్చిన వారికి ఉప కేంద్రంలో చికిత్స అందిస్తారు. అనారోగ్యానికి గురైతే మందులు అందజేస్తారు. చిన్నారులకు టీకాలు వేస్తారు. తలుపులు, కిటికీలు పగలగొట్టడంతో సామగ్రి ఎక్కడ పోతుందేమోనని ఆరోగ్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా ఇక్కడ నీటి సౌకర్యంతో పాటు యంత్రాలు, విద్యుత్ రిపేర్లు కావాల్సి ఉంది. ముఖ్యంగా ధ్వంసమైన తలుపులు, కిటికీలు, వాటికి అద్దాలను బిగించాల్సి ఉంది. ఉన్నతాధికారులు నిధులు విడుదల చేయక కొన్ని నెలలుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు.



డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్‌లోని ఆరోగ్య ఉప కేంద్రం





ధ్వంసమైన తలుపు, పగిలిపోయిన కిటికీ అద్దాలు

మరమ్మతుల కోసం లేఖ రాశాం

నికాల్‌పూర్‌లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రంలో మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఇదివరకే లేఖ రాశాం. పరికరాలు, బోరు, ఎలక్ట్రిసిటీ కావాలని కూడా అడిగాం. నిధులు మంజూరైన వెంటనే తలుపులు, కిటికీలు, ఇతర మరమ్మతులు చేయిస్తాం.

– సుచరిత, హెల్త్ ఆఫీసర్, డొంకేశ్వర్

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు

భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా బలిదాన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం, దేశం కోసం ఆయన చేసిన పోరాటాలను, సేవలను బీజేపీ నేతలు కొనియాడారు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన 1953, జూన్ 23న జైలులో అనుమానాస్పదంగా మృతిచెందారని గుర్తు చేశారు. శ్యామా ప్రసాద్ ఆలోచనలు ఆదర్శాలను ప్రధాన మోదీ ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. – సాక్షి నెట్‌వర్క్





నవీపేట్‌లో ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేత వడ్డీ మోహన్ రెడ్డి.. గుమ్మిర్యాల్‌లో..



ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో..



బాల్కొండ మండల కేంద్రంలో..



జానకంపేటలో మొక్కలు నాటుతున్న నేతలు



చౌట్‌పల్లిలో మొక్క నాటుతున్న మల్లికార్జున్‌రెడ్డి

గోవధ నిషేధ చట్టాన్ని పాటించాలి



కందకుర్తిలో చెక్‌పోస్టు సిబ్బందికి సూచనలు ఇస్తున్న బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్



ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ, గోరక్ష సభ్యులు

రెంజల్(బోధన్): గోవధ నిషేధ చట్టాన్ని తప్పకుండా పాటించాలని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ సూచించారు. శుక్రవారం సాటాపూర్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను అక్రమంగా తరలించవద్దని సూచించారు. గోవులను కొన్నా, అమ్మినా కేసులు తప్పవన్నారు. పరిమితికి మించి వాహనాల్లో తరలించవద్దని అన్నారు. అనంతరం కందకుర్తి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సందర్శించారు. గోవులను వాహనాల్లో రవాణా చేస్తే వెంటనే గోశాలకు తరలించాలని సిబ్బందికి సూచించారు. రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్, రెంజల్ ఎస్సై సాయన్న, సాటాపూర్ సర్పంచ్ ఎఖార్ పాష, ఎంపీటీసీ హైమద్ పాల్గొన్నారు.

గో హత్యలను ఆపాలి

ఆర్మూర్‌టౌన్: విచ్చల విడిగా జరుగుతున్న గో హత్యలను, అక్రమ రవాణాను అడ్డుకోవాలని జిల్లా గోరక్ష ప్రముఖ్ శ్రీధర్ అన్నారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం విశ్వ హిందూ పరిషత్, గో రక్ష ఆధ్వర్యంలో ఏపీపీ ప్రభాకర్ రావుకు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గో సంతతిని కాపాడాలని, కఠినంగా చట్టాన్ని అమలు చేయాలన్నారు. నగర కార్యదర్శి కొంగి రవి, జిల్లా మఠ మందిర్ ప్రముఖ్ గాజుల దయానంద్, జిల్లా ధర్మచర్య ప్రముఖ్ నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై కేజ్‌వీల్స్ నడపొద్దు



వేల్పూర్: రహదారులపై కేజ్‌వీల్స్ నడపొద్దని వేల్పూర్ పోలీసులు గ్రామాలలో ప్రచారం చేపట్టారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు కేజ్‌వీల్స్ బిగించే అవకాశం ఉంటుంది. కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడపడం వల్ల రూ.కోట్లతో నిర్మించిన రహదారులన్నీ చెడిపోతాయని అవగాహన కల్పించారు. ఎవరైనా నడిపితే ట్రాక్టర్లు సీజ్ చేస్తామని ఆటోకు ఫ్లెక్సీ బిగించి లౌడ్ స్పీకర్ ద్వారా హెచ్చరిస్తున్నారు. కేజ్‌వీల్స్‌కు పట్టీలు బిగించుకొని పొలాలకు తీసుకెళ్లాలని ఎస్సై వినయ్ కుమార్ సూచించారు.

నిరుపేదలకు ఇళ్లస్థలాల కేటాయింపు



రుద్రూర్: మండల కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన నిరుపేద మహిళలకు ఇళ్ల స్థలాలను శుక్రవారం తహసీల్దార్ ముజీబ్ కేటాయించారు. అద్దె ఇంటిలో ఉంటూ జీవనాన్ని గడుపుతున్నామని మహిళలు ఇటీవల అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించారు. దీంతో స్పీకర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ జరిపి ఇళ్ల స్థలాలను కేటాయించారు. జెడ్పీటీసీ నరోజి గంగారాం, ఎంపీపీ అక్కపల్లి సుజాత, వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, విండో చైర్మన్ బద్దం సంజీవరెడ్డి, మాజీ విండో చైర్మన్ పత్తి రాము, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పత్తి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో లక్కీ డ్రా ద్వారా ..

మోర్తాడ్: మోర్తాడ్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను లక్కీ డ్రా పద్ధతిలో లబ్ధిదారులకు కేటాయించారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో లక్కీ డ్రా నిర్వహించి 160 మంది లబ్ధిదారులకు కేటాయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భావయ్య, ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు బద్దం రవి, వైస్ ఎంపీపీ తొగటి శ్రీనివాస్, సర్పంచ్ భోగ ధరణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాపాయి పవన్, తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలను తొలగించాలి

ఆర్మూర్‌టౌన్: ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంటే వాటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని పట్టణ ఆరోగ్య కేంద్రం సబ్‌యూనిట్ అధికారి సాయి అన్నారు. పట్టణంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా హౌసింగ్‌బోర్డు కాలనీలో డెంగీ, మలేరియా మాసోత్సవాల సందర్భంగా అధికారులు ఇంటింటికి తిరిగి నీటి నిల్వలను తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి నిల్వలు ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు సంభవిస్తాయన్నారు. పర్యవేక్షకుడు చంద్రశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ అధికారి

అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో రోడ్డును కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్న దాన్ని కూల్చివేయాలని విద్యానగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. బుధవారం అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తున్న స్థలం ఎదుట కాలనీవాసులు ధర్నా చేపట్టారు. అలాగే టౌన్‌ప్లానింగ్ అధికారులను పిలిపించి రోడ్డుకు సంబంధించిన డాక్యుమెంట్స్ చూపించామని కాలనీవాసులు తెలిపారు. కాలనీవాసుల కోసం రోడ్డు నిర్మించాలని కోరారు. కాలనీవాసులు యమాద్రి భాస్కర్, పృథ్వీరాజ్, గంగాధర్, గిరి, భూమేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యానగర్ కాలనీవాసులు

సమాచారం..

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నందిపేట్(ఆర్మూర్): నందిపేటలోని 132 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరింగ్ అధికారి ఎం.అశోక్ తెలిపారు. నందిపేట, మాక్లూర్, డొంకేశ్వర్ మండలాల పరిధిలో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

నేడు బాల్కొండలో జగన్నాథ రథ మహోత్సవం

బాల్కొండ: మండల కేంద్రంలో శనివారం జగన్నాథ రథ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు భక్త జన సంఘం సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆర్మూర్ గల్లీ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు ఎంకే గార్డెన్ వరకు చేరుకుంటుందన్నారు. తరువాత హరినామ సంకీర్తనలతో సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా వాయిదా

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా ఎల్‌ఎండీ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ధర్నాను వాయిదా వేసినట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. మోస్తారు వర్షం కురువడం వల్ల రైతులు విత్తన పనుల్లో బిజీగా ఉన్నారన్నారు. రైతుల మేలు కోసం చేపట్టిన ధర్నా కావడంతో రైతులకు వర్షం కురవడం వల్ల విత్తనం విత్తుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న బీజేవైఎం నాయకులు



రాయకూర్ క్యాంపులో ప్రచారం చేస్తున్న నేతలు

పెర్కిట్(ఆర్మూర్): మహాజన్ సంపర్క్ అభియాన్.. కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువత తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల బాలు, పట్టణ, మండల అధ్యక్షులు ప్రశాంత్, నరేష్ చారిన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

రుద్రూర్: రాష్ట్రంలో రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని మండల బీజేపీ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ అన్నారు. రుద్రూర్ మండలం రాయకూర్ క్యాంపు, సిద్ధాపూర్ గ్రామాల్లో శుక్రవారం మహాజన్ సంపర్క్ అభియాన్.. కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాల పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేశారు. ఆయన వెంట స్థానిక పార్టీ నాయకులు ఉన్నారు.

విద్యారంగంపై చిన్నచూపు

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై చిన్నచూపు చూస్తోందని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆర్మూర్‌లోని క్షత్రియ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో దగాపడ్డ తెలంగాణ, మార్పు కోసం- మహా ఉద్యమం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, నిరుద్యోగ, ప్రజా వ్యతిరేక పాలన గురించి వివరించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, లక్ష ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో మరో ఉద్యమం శ్రీకారం చుట్టబోతున్నామని, విద్యార్థులు, నిరుద్యోగులు పూర్తిస్థాయిలో మద్దతు తెలపాలన్నారు. ఇందూర్ నగర అధ్యక్షుడు వెంకట కృష్ణ,విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర నేత శ్రీనివాస్‌గౌడ్

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

బోధన్‌టౌన్(బోధన్): అఖిల భారత విద్యార్థి బ్లాక్(ఏఐఎస్‌బీ) 73వ వార్షికోత్సవాల వాల్ పోస్టర్లను శుక్రవారం పట్టణంలోని విద్యావికాస్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ రాష్ట్ర కమిటీ నాయకులు నాగరాజు మాట్లాడారు. ఈ నెల 25న నిర్వహించనున్న 73వ వార్షికోత్సవాలకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ కలలుగన్న భారత దేశ నిర్మాణానికై ఉద్యమిస్తూ, విద్యారంగ సమస్యలపై ఏఐఎస్‌బీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. ఏఐఎస్‌బీ డివిజన్ నాయకులు రాజన్న, గంగాశంకర్, శ్రీను, ప్రదీప్, సతీష్, సుధాకర్, ప్రకాష్ ఉన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా బోనాల పండుగ



బోధన్‌టౌన్(బోధన్): ఆరుద్ర పండుగను పురస్కరించుకొని పట్టణంలోని రెడ్డికా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హెడ్ పోస్టాఫీసు నుంచి మహిళలు భాజాభజంత్రీల మధ్య బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా మహాలక్ష్మి మందిరంలోని అమ్మవారి వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. అనంతరం రెడ్డికా సంఘం ప్రధాన కార్యదర్శి గుమ్ముల అశోక్ రెడ్డి మాట్లాడారు. అరుద్ర పండుగ రోజు అనంతరం బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సంఘం ప్రతినిధులు గుమ్ముల సాయిరెడ్డి, గుంత గంగాధర్, రుద్ర సత్యనారాయణ ఉన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఆదిపురుష్ (3డీ-తెలుగు) – 3.10
ది ఫ్లాష్ – 12.00, 6.55, 10.05

స్క్రీన్-2 – ఆదిపురుష్ (3డీ-తెలుగు) – 8.00, 11.45, 3.30, 7.15, 11.00

స్క్రీన్-3 – ఆదిపురుష్ (2డీ-తెలుగు) – 10.30, 2.15, 6.00, 9.45

స్క్రీన్-4 – ఆదిపురుష్ (2డీ-తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



నందిపేట్(ఆర్మూర్): తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నందిపేట మండల పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ బూత్‌స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 60 ఓట్లకు ఒకరు చొప్పున క్రియాశీల కార్యకర్తలను ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ ఎర్రం యమున, కోఆప్షన్ సభ్యులు సయ్యద్, ఎంపీటీసీ మురళి పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



రుద్రూర్: మోస్రా మండలంలోని గోవూర్ హైస్కూల్లో రాష్ట్ర ప్రభుత్వం సరాఫరా చేసిన ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లను శుక్రవారం విద్యార్థులకు గోవూర్ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ నన్నేసాబ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమంలో బోధన కొనసాగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్ఎం రవీంద్రబాబు, ఉపాధ్యాయులు జరీనా, ప్రసన్న లక్ష్మి తదితరులున్నారు..

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



మాక్లూర్: మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఏసీపీ కిరణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నెలవారి క్రైంతో పాటు రోజు పోలీస్‌స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలను ఏసీపీ కిరణ్ కుమార్, ఎస్సై యాదగిరిగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులను తనిఖీ చేశారు. అవసరం నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ప్రతి కేసును ఎఫ్ఐఆర్ చేయటం కన్నా ఇరువురి ఒప్పించి రాజీ కుదర్చాలన్నారు. ఇటీవల మండల పరిధిలో జరుగుతున్న వరుస దొంగతనాలపై ఆరా తీశారు. ప్రతి రోజు పెట్రోలింగ్ చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు.